క్లుప్తంగా

బార్ అండ్ రెస్టారెంట్ సీజ్



నెహ్రూనగర్: మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన మందు బాటిళ్లను బార్ అండ్ రెస్టారెంట్‌లో విక్రయిస్తున్న నేపథ్యంలో బార్‌ను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ గుంటూరు– 2 టౌన్ సీఐ యశోదరా దేవి తెలిపారు. శనివారం గుంటూరు నగరంలో స్టేట్ టాస్క్ ఫోర్స్ సీఐ భాను సత్యనారాయణ ఆధ్వర్యంలో బార్ అండ్ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆర్టీఓ ఆఫీసు రోడ్డులోని ఆపిల్ బార్‌లో వైన్ షాపులో అమ్మాల్సిన మద్యం బాటిల్స్‌ను బార్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆపిల్ వైన్స్ నుంచి బార్ అండ్ రెస్టారెంట్‌కు మద్యం సరఫరా అయినట్లు గుర్తించి అధికారులు ఆపిల్ వైన్స్ లైసెన్సును సస్పెండ్ చేయడంతో పాటు బార్ అండ్ రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

19న చలో ఢిల్లీ




నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 19న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ తెలిపారు. శనివారం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్న మాల, మాదిగలను విడదీయడం దారుణమన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు వర్గీకరణ బిల్లును తిరస్కరించాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీకి మాలలంతా మద్దతుగా నిలిచి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తే ఈనాడు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీలో అత్యధికగా ఉన్న మాలలను వర్గీకరణ చేయడం ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డాక్టర్ గోదా జాన్‌పాల్, విప్పర్ల విజయభాస్కర్, స్టాలిన్, రేఖ పాల్గొన్నారు.

కిల్కారి కాల్స్ సేవలు వినియోగించుకోవాలి

పెదకాకాని: మాత శిశు మరణాలు తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కిల్కారి కాల్స్ ప్రవేశ పెట్టిందని ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు తెలియజేశారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు కిల్కారి కాల్ గురించి అవగాహన కలిపించారు. కిల్కారి కాల్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. కిల్కారి కాల్ సూచనలు పాటిస్తే సుఖ ప్రసవంతో పాటు తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. కిల్కారి కాల్స్ గర్భిణులకు 4వ నెల మొదలుకొని, బిడ్డ పుట్టిన సంవత్సరం వరకు వస్తాయన్నారు. ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వారానికి ఒకసారి గర్భిణులు, బాలింతల మొబైల్స్‌కి వస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు కిల్కారి కాల్ నెంబర్ 01244451660ను తమ ఫోన్లలో సేవ్ చేసుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రవీణ దీప్తి, పీహెచ్ఎన్ పద్మ, ఎంపీహెచ్ఎస్ సుకుమార్, హెచ్‌వి దేవి, మండలంలోని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోటరీ సేవలపై విస్తృత ప్రదర్శన



తెనాలి: రోటరీ ప్రచార కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో శనివారం క్లబ్ సభ్యులు పట్టణంలో ప్రదర్శన చేశారు. రోటరీలో కొత్త సభ్యులను చేర్చుకోవటం, కొత్తగా క్లబ్బులు ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ ప్రదర్శన నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజసేవపై ఆసక్తి కలిగిన వివిధ రంగాల ప్రజలు రోటరీలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలనకు రోటరీ ఇంటర్నేషనల్ చేస్తున్న అద్భుత సేవను గుర్తుచేశారు. అంతేకాకుండా సమాజంలో వివిధ రకాలైన వ్యక్తులు, విద్యార్థులకు అవసరమైన వసతుల ఏర్పాటుకు, మహిళల స్వావలంబనకు, పర్యావరణ పరిరక్షణతో సహా పలు రకాల సేవలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యక్తిగతంగా కన్నా సామూహికంగా చేసే సేవకు ఫలితం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రదర్శనలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, మెంబర్‌షిప్ చైర్ మల్లాది అర్జున, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ డి రవీంద్రనాథ్, వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, గుమ్మడి ప్రసాద్, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పనులతో తప్పని తిప్పలు

- నెలలు గడిచినా పూడ్చని భూగర్భ డ్రెయిన్ గుంతలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న స్థానికులు



నాయుడుపేట 1/1వ అడ్డరోడ్డు పరిస్థితి

నగరంపాలెం: ప్రజల సౌకర్యాలపై నిర్లక్ష్యం వీడడం లేదు. అడుగడుగునా ఇబ్బందులు పడుతున్నారు. పనుల పేరుతో కాంట్రాక్టర్ల తీరుపై అసంతృప్తి నెలకొంది. అభివృద్ధి పేరుతో చేపడుతున్న నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. కనీసం ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చేందుకు వీల్లేకుండా ఉండటంతో అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ఓ హోటల్ నుంచి వచ్చే వృథా నీరు నిలిచిపోవడంతో మరింత దుర్వాసన వెదజల్లుతోందని వాపోయారు.

- కొరిటెపాడు పరిధిలోని నాయుడుపేటలో ఐదు వీధులు, రెండు అడ్డరోడ్లు ఉన్నాయి. ఆయా వీధుల్లో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణానికి సుమారు నాలుగు నెలలు కిందట పనులు ప్రారంభించారు. తొలుత భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తి చేశారు. అయితే ఒకటి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వీధుల మధ్యలో తవ్విన గుంతలను చదును చేయడాన్ని పూర్తిగా విస్మరించారు. అప్పట్నించి ఇప్పటి వరకు ఆ వీధులు గుంతలుగా మారాయి. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాల ధాటికి మరింత బురదమయం అయ్యాయి. అంతేగాక రిజిస్ట్రార్ కార్యాలయం, ఓ ప్రైవేటు కళాశాల, ఇతరత్రా దుకాణాల నెలకొనడంతో రాకపోకలతో రద్దీగా ఉంటోంది. అంతేగాక కార్యాలయం, కళాశాల, దుకాణదారుల వద్దకు వచ్చే మోటారు సైకిళ్లను రహదారిపైనే నిలుపుదల చేస్తున్నారు. లోతట్టు గుంతలు, వాహనాలు ఇష్టానుసారంగా నిలుపుదల చేయడంతో రాకపోకలకు కష్టంగానే ఉంటుంది. ఇక ఒకటో వీధిలోనూ అదే పరిస్థితి నెలకొంది.
- ఒకటో వీధిలోని ఉంటున్న స్థానికుల ఇబ్బందులు అన్ని ఇన్ని కావు. ఒక్కసారిగా రహదారికి ఇరు వైపులా కాలువలను పగులకొట్టారు. 1/1వ అడ్డరోడ్డులోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో మట్టి, రాళ్లను రహదారి మధ్యలో వదిలేశారు. రెండు వైపులా కాల్వలను ఒకేసారి పగులకొట్టడం ఎంత వరకు సమంజసమని స్థానికులు వాపోతున్నారు. కనీసం ఓ వైపు కాల్వల నిర్మాణాలు చేపట్టాక, మరో వైపు కాల్వలు నిర్మిస్తే అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు తెలిపారు. ఒకేసారి ఇరువైపులా కాల్వలు తొలగించడంతో ఇళ్లల్లో నుంచి వచ్చే నీరంతా ఆ గుంతల్లోనే నిలిచిపోతుంది. అదిగాక ఓ హోటల్ నుంచి వచ్చే నీరంతా అక్కడే ఆగిపోతుంది. దీంతో భరించలేని దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోయారు. ఆ వాసన తట్టుకోలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. వాసన ధాటికి వాంతుల బారినపడినట్లు ఓ స్థానికుడు వాపోయాడు. పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు సైతం ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఎన్నేసి నెలలకు ఈ కాల్వలు, రహదారుల నిర్మాణాలు పూర్తి అవుతాయనేది అర్థంకావడంలేదని చెప్పారు.
- ఒకటో వీధిలో చేపడుతున్న నిర్మాణ పనుల్లో కనీస జాగ్రత్తలు పాటించలేదు. తాగునీటి పైపులైన్లను ప్రొక్లెయిన్‌తో తొలగించారు. అదేమని అడిగితే తమకు సంబంధంలేదని పనులు నిర్వర్తించే వారు చెబుతున్నారని స్థానికులు తెలిపారు. దీంతో జీఎంసీకి రెండు పర్యాయాలు సుమారు. రూ.6.5 వేలు చెల్లించి, తాగునీటి పనులు చేయించుకున్నట్లు ఓ స్థానికుడు వాపోయారు. డ్రెయినేజీ కనెక్షన్ల నిమిత్తం రూ.6 వేలు వసూలు చేశారని తెలిపారు. అదిగాక కనెక్షన్ల నిమిత్తం రశీదులు ఇవ్వడంలేదని వాపోయారు. కనీసం నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని స్థానికులు కోరారు.



నాయుడుపేట ఒకటో వీధి దుస్థితి



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డులో గుంతలు

ఆర్టీసీ భూముల లీజు జీఓను రద్దు చేయాలి

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ భూములను అప్పనంగా లులూ షాపింగ్ మాల్‌కు లీజుకు ఇస్తూ జారీ చేసిన జీఓను తక్షణమే రద్దు చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి షేక్ కరీముల్లా డిమాండ్ చేశారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. కరీముల్లా మాట్లాడుతూ విజయవాడలోని గవర్నర్‌పేటలో ఉన్న ఆర్టీసీ స్థలాన్ని లులూ షాపింగ్‌మాల్‌కు ఇస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 137ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆస్తులు, సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులమైన తమపై ఉందని చెప్పారు. రూ.400 కోట్ల విలువ చేసే 4.15 ఎకరాల భూమిని 99 సంవత్సరాలు లీజుకు ఇవ్వడం సరికాదన్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విజయకుమార్, ఖాశిం, జె.రత్నాకర్, మస్తాన్‌వలి, ఆర్.ఎస్.రావు, ప్రకాష్, డిపో–1, 2 కార్మికులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

రామాయణం అంతట సీతారాముల దాంపత్య ఔన్నత్యం

నగరంపాలెం: రామాయణం అంతట సీతారాముల దాంపత్య ఔన్నత్యం కనిపిస్తుందని డాక్టర్ మరుధూరి నరసింహా చార్యులు అన్నారు. ఏటీ అగ్రహారం కంచి కామకోటి పీఠ శంకర, గాయత్రీ, దత్తసాయి, సత్యదేవ మందిరం(గాయత్రీ మాతా మందిరం)లో సంస్కృత భారతీ ఆధ్వర్యంలో సంస్కృత సప్తాహం శనివారం నిర్వహించారు. రామాయణం- దాంపత్యం అనే అంశంపై డాక్టర్ మరుధూరి నరసింహా చార్యులు మాట్లాడుతూ సీతాదేవికి దండకారణ్య కష్టంగా ఉండరాదని రాముడు ప్రయత్నించగా, సీత తన భర్తను ఒప్పించి అరణ్యానికి బయలుదేరిందని అన్నారు. ఎంత కష్టమైనా దంపతులు సుఖంగా అనుభవిస్తారని పేర్కొన్నారు. అరణ్యకాండలో దంపతులు చక్కని జీవితాన్ని గడిపారని చెప్పారు. అనసూయాదేవి సీతకు దాంపత్య ధర్మాలను తెలియజేసిందని అన్నారు. లోకానికి దాంపత్య వైభవాన్ని తెలియజేసిన గ్రంథం రామాయణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్కృత భారతీ గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.సుబ్బారావు, గర్నేపూడి రాధాకృష్ణ, బృందావని, డాక్టర్ పెసల దేవేంద్రగుప్త పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహాచార్యులు

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. కీర్తన ఆర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు(హైదరాబాద్) విద్వాన్ డాక్టర్ కమలారమణి శాస్త్రీయ సంగీత కచేరి, డాక్టర్ ఎం.శ్రీధర్, కీర్తన ట్రస్ట్ అధ్యక్షులు ఎం.విజయలక్ష్మి, డాక్టర్ ఎం.సుమిత్ర, ఆలయ పాలకమండలి నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. త్యాగరాజ కీర్తనలు, వాగ్గేయ కార కృతులను కమలారమణి శ్రావ్యంగా గానం చేశారు. వయోలిన్‌పై పి.నందకుమార్, మృదంగంపై బి.సురేష్ బాబు వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొనగా, కళాకారులను అతిథులను సత్కరించారు.



కీర్తనలు ఆలపిస్తున్న కమలారమణి

పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుదాం

జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలకసంస్థ పరిధిలో మిషన్ గ్రీన్ గుంటూరు ద్వారా పచ్చని పర్యావరణహిత నగరంగా గుంటూరు రూపుదిద్దుకుంటుందని, కాలనీల, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు తమ ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించుకోవాడానికి ముందుకు రావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం గోరంట్ల కోదండరామ నగర్‌లో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మొక్కలు నాటే కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ఈ సీజన్లో నగరంలో దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ప్రజా ప్రతినిధులను, జీఎంసీ అధికారులు, సచివాలయ కార్యదర్శులను, స్థానిక ప్రజలు, వివిధ స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ మిషన్ గ్రీన్ గుంటూరులో పాల్గొని మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వ్యక్తిగత బాధ్యతగా భావించినప్పుడు గుంటూరు నగరం పర్యావరణహితంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా కోదండరామ నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నరసింహారావు, జనరల్ సెక్రటరీ బి.హనోక్, బి.గోపికృష్ణ, ఎ.సుందర రావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కమిషనర్

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి

తెనాలిఅర్బన్: ఆదివాసీల సమస్యల పరిష్కారానికి జై భీమ్ ఫెడరేషన్ కృషి చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు కొలెవరపు దేవయ్య పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివాసీల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం జై భీమ్ ఫెడరేషన్ అనుబంధ ఆదివాసీల సంఘ అధ్యక్షులుగా పేరం అరుణ, కార్యదర్శిగా దూసరపు లావణ్య, పొట్లూరు శ్రీధర్‌లకు నియామకపత్రాలు అందజేశారు.

అంతరిక్ష విజ్ఞానం అనంతం


గుంటూరు ఎడ్యుకేషన్: అంతరిక్ష విజ్ఞానం అనంతమైనదని స్పేస్ కిడ్స్ ఇండియా సీఈఓ కేశాన్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా– ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయ్ 106వ జయంతి సందర్భంగా ప్రారంభించిన అంతరిక్ష విజ్ఞాన వారోత్సవాల్లో భాగంగా శనివారం అంతరిక్ష విజ్ఞానంపై వెబినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేశాన్ మాట్లాడుతూ అంతరిక్ష జ్ఞానం అందరికీ జిజ్ఞాసను పెంచుతుందని అన్నారు. విశ్వానికి సరిహద్దులు ఉన్నాయా, ఎన్ని నక్షత్రాలు ఉంటాయనే సందేహాలతో పాటు విశ్వంలో ఎక్కడైనా జీవం ఉందా ఇలా ఎన్నో అనుమానాలు, ప్రశ్నలు మనకు వస్తుంటాయని అన్నారు. విశ్వ రహస్యాలు ఛేదించే దిశలో మానవుడు నిరంతరం పరిశోధనలు చేస్తునే ఉన్నాడని తెలిపారు.

ఈసందర్భంగా వెబినార్‌లో పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అంతరిక్షంలోకి వెళ్లాలంటే కఠినమైన శిక్షణ అవసరమని, మానసికంగా, శారీరకంగా బలం కలిగి ఉండాలని సూచించారు. మనదేశంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల్లో ముఖ్యంగా బాలికలతో అంతరిక్ష సంబంధమైన అనేక ప్రాజెక్టులు చేస్తూ ఉన్నారన్నారు. ప్రపంచపటంలో మన దేశాన్ని ఇస్రో ఉన్నత స్థానంలో ఉంచుతుందని, విద్యార్థులు హార్డ్‌వర్క్ ద్వారానే ఉన్నత స్థాయికి చేరుతారని చెప్పారు. కార్యక్రమంలో మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

హామీతో నిరసన విరమించిన కార్మికులు

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఎం బుక్ కార్మికుల సంఘటితంగా పోరాటం చేసి విజయం సాధించారని సీఐటీయూ నాయకులు వి.వి. జవహర్‌లాల్ అన్నారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో శనివారం రాత్రి ఎం బుక్ కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. జిల్లా నాయకులు ఎస్.ఎస్. చెంగయ్య మాట్లాడుతూ ఎం బుక్ కార్మికుల శ్రమ దోపిడీని నిరసిస్తూ ఏడు రోజులు ఆందోళన చేసి విజయం సాధించినట్లు చెప్పారు. సంఘటితంగా ఉంటే ఎంతటి సమస్య అయినా పరిష్కారం అవుతుందని తెలిపారు. కాంట్రాక్టర్ నెలకు రూ. 11,000 వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, నెలకు నాలుగు రోజులు సెలవులు కూడా ఇస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో కార్మికులు నిరసన విరమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం. బాలాజీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి పట్టణ నాయకులు పుణ్యవతి, రజని పాల్గొన్నారు.

యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరపాలి



తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో కూటమి ప్రభుత్వం చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి, మద్దతు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన తాడేపల్లి సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అసమర్థుల చేతిలో పెట్టి అస్తవ్యస్తం చేసిందని తెలిపారు. 333 మంది కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించామని, యజమాని కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, సూర్య ప్రకాశరావు, నాగేశ్వరరావు, కార్మికులు ఇమాంబి, శారమ్మ, శివకుమారి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు విద్యా సంస్థలు సహకరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని శంకర్ విలాస్ వంతెన నూతన నిర్మాణ దృష్ట్యా శనివారం నుంచి పూర్తి స్థాయిలో రాకపోకలు నిలిపివేయడం జరిగిందని, నగరంలోని విద్యా సంస్థలు ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కోసం ఏ (ఉదయం 8.30 నుంచి 4 గంటల వరకు), బీ (9.15 నుంచి 4.45 గంటల వరకు) షిఫ్టులుగా విద్యా సంస్థలు టైమింగ్స్ మార్చుకొని సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో విద్యా సంస్థల ప్రతినిధులు, స్కూల్, కాలేజి ఎడ్యుకేషన్ అధికారులు, జీఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు వేగంగా జరుగుతున్న రీత్యా, తొలిదశలో భాగంగా శనివారం నుంచి వంతెన తొలగింపు పనులు ప్రారంభయ్యాయన్నారు. ప్రత్యామ్నాయ రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నగరంలోని విద్యా సంస్థలను స్కూల్, ఇంటర్మీడియట్ కేటగిరిలుగా పరిగణలోకి తీసుకొని ఏ, బి షిఫ్టులుగా వర్కింగ్ టైమింగ్స్ మార్చుకోవాలని సూచిస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికే ట్రాఫిక్ నియంత్రణకు సూచించిన మార్గాల్లో ఆక్రమణలు తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఏ, బీ షిఫ్టులుగా విద్యా సంస్థల టైమింగ్ మార్పు చేసి ప్రొసిడింగ్స్ ఇస్తామని, కొన్ని రోజుల తర్వాత ఏమైనా సమస్యలు గుర్తిస్తే మార్పులు చేసుకుందామని, ప్రతి విద్యా సంస్థ సహకరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రయాణించవచ్చని తెలిపారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అందులో భాగంగా విద్యా సంస్థల్లో విద్యార్థులకు హర్ ఘర్ తిరంగా థీంపై పెయింటింగ్స్, వ్యాసరచన, వక్తృత్వం, రంగోలి పోటీలు నిర్వహించాలని సూచించారు. ప్రతి స్కూల్‌లో హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో ప్లాస్టిక్ రహిత జెండాలను అన్ని విద్యా సంస్థలు, ఇళ్లపై ఎగురవేయాలన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందరామిరెడ్డి, ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

అవయవదానంతో మరణించినా జీవించవచ్చు



అవయవదానంపై లఘునాటిక ప్రదర్శిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ

గుంటూరు మెడికల్: అవయవదానంతో మనిషి మరణించినా జీవించవచ్చని, తాను మరణిస్తూ మరో పది మందికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. అంతర్జాతీయ అవయవదాన వారోత్సవాల సందర్భంగా శనివారం గుంటూరు జీజీహెచ్‌లో అవయవదానంపై ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నర్సింగ్ విద్యార్థులు అవయవదాన ప్రాధాన్యం తెలిసేలా లఘునాటిక ప్రదర్శించారు. ర్యాలీగా ప్లకార్డులు పట్టుకుని ఆస్పత్రి చుట్టూ ర్యాలీ చేశారు. ఆస్పత్రి శుశృత హాలులో వైద్యులు, వైద్య సిబ్బంది సమావేశమై అవయవదాన ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ అవయవదానంపై ప్రజల్లో అపోహలు, అనుమానాలు ఉన్నాయని, అందువల్లే అనేక మంది చనిపోయిన తరువాత శరీరాన్ని కాల్చడం, లేదా, పూడ్చడం చేస్తున్నారన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులు అవయవదాన ప్రాధాన్యాన్ని గుర్తించి అవయవాలు దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు నూతన జీవితాన్ని ప్రసాదించి, అమరులుగా మిగిలిపోతారన్నారు.

ఏకలవ్యుని స్ఫూర్తితో ఎరుకుల సమాజాభివృద్ధి

జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు మేడా లక్ష్మయ్య



ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గుంటూరు రూరల్: తమ జాతి గుండె చప్పుడు, కులదైవం ఏకలవ్యుని స్ఫూర్తితో దశాబ్దాలుగా విద్య, రాజకీయ సామాజిక రంగాలలో వెనుకబడి ఉన్న ఏరుకుల సమాజాభివృద్ధికి కృషి చేస్తామని జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు మేడా లక్ష్మయ్య పేర్కొన్నారు. జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా శనివారం అమరావతి రోడ్డు నగరాలు ప్రధాన వీధిలో గల ఏకలవ్యుని విగ్రహానికి పెద్దఎత్తున పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ హాస్పిటల్ అండ్ ల్యాబ్స్ జనరల్ మల్టీ స్పెషాలిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ నూకతోటి బాలాజీతో ప్రారంభించారు. వైద్య శిబిరంలో ప్రభుత్వ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బుచ్చిబాబు, జనరల్ ఫిజీషియన్ ఎం.ఆదం ఖాన్, డాక్టర్ దామర్ల ఆషా తదితర వైద్యులచే సాధారణ వైద్య సేవలతో పాటు గర్భిణులకు పరీక్షలు, షుగర్, బీపీ, థైరాయిడ్, గుండె, దంత, చర్మ, ఎముకల వైద్య నిపుణులు ఉచిత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మేడా హనుమంతరావు, ఉపాధ్యక్షుడు ఉయ్యాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తోకల పాపారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి తోకల రామకృష్ణ, సహాయ కార్యదర్శి మేడ బ్రహ్మయ్య, కోశాధికారి కుంభ ఏడుకొండలు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుంటూరులో 99 అడుగుల మట్టి గణపతి

విగ్రహ నమూనా ఆవిష్కరించిన కేంద్ర మంత్రి పెమ్మసాని



వినాయక విగ్రహ నమూనా, ఏర్పాట్ల వెబ్‌సైట్ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి చంద్రశేఖర్

గుంటూరు రూరల్: గుంటూరులో అమరావతి పేరుతో 99 అడుగుల మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో వినాయక విగ్రహం నమూనా, ఉత్సవ ఏర్పాట్లు చెందిన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ లేకుండా, ప్లాస్టిక్ వినియోగించకుండా ప్రకృతి సిద్ధమైన మట్టి, పుణ్య నదులైన గంగా, కృష్ణ, గోదావరి నీటితో విగ్రహం తయారు చేయడం గొప్ప విషయమన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.నరేంద్ర మాట్లాడుతూ గణేశుని విగ్రహం వద్ద ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ వరకు 21 రోజులు నిత్య పూజలు, హోమాలు, యాగాలు జరుగుతాయన్నారు. ఇన్నర్‌రింగ్‌రోడ్డు, రెడ్డిపాలెం వద్ద ఈ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రావడానికి దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేసారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, తోట సాయికృష్ణ, జాకీరు, దామోదర్, గంటా స్వామి, దుర్గారెడ్డి, జి.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.